ఉద్రిక్తంగా సిపిఎం 'చలో రాజ్ భవన్'

- ర్యాలీని అడ్డుకున్న పోలీసులు
- ప్రతినిధి బృందానికి రాజ్ భవన్‌లోకి అనుమతి నిరాకరణ
- అక్కడే బైఠాయించిన జాన్ వెస్లీ, ఇతర నాయకులు
- బలవంతంగా అరెస్టు చేసిన పోలీసులు
- తిరగబడ్డ నిరసనకారులు... పోలీసులతో వాగ్వాదం, తొక్కిసలాట
- గవర్నర్ వైఖరికి నిరసనగా నేడు రాష్ట్ర వ్యాప్త నిరసనలు

ఖైరతాబాద్ మెట్రో స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న జాన్ వెస్లీ తదితరులు

రాజ్ భవన్ గేట్ వద్ద పార్టీ కార్యదర్శి జాన్ వెస్లీని అరెస్టు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి హైదరాబాద్ బ్యూరో

బిసిలకు 42 శాతం రిజర్వేషన్ అమలు కోసం సిపిఎం రాష్ట్ర కమిటీ శుక్రవారం తలపెట్టిన ఛలో రాజ్ భవన్ తీవ్ర ఉద్రిక్తంగా మారింది. హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ మెట్రో స్టేషన్ నుంచి నుంచి సోమాజీగూడ వరకు ర్యాలీగా గవర్నర్‌కు వినతి పత్రం సమర్పించేందుకు వెళ్తున్న వారిని పోలీసులు మెట్రో రెసిడెన్సీ వద్ద అడ్డుకున్నారు. అప్పటికే బారికేడ్లు వేసి ముందుకెళ్లకుండా నిలిపివేయడంతో నాయకులు, కార్యకర్తలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు.ఒక దశలో బారికేడ్లను తొలగించుకుని వెళ్లేందుకు కార్యకర్తలు చేసిన ప్రయత్నాలను పోలీసులు భగ్నం చేశారు. వారిని బలవంతంగా అడ్డుకున్నారు. అక్కడ్నుంచి పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ నేతృత్వంలో ప్రతినిధి బృందాన్ని మాత్రం వెళ్లనిచ్చినప్పటికీ రాజ్ భవన్ గేటు వద్దే లోపలికి వెళ్లకుండా భద్రతా సిబ్బంది అడ్డుకోవడంతో వారు అక్కడే బైఠాయించారు. బిసిలకు వ్యతిరేకంగా గవర్నర్ మొండి వైఖరితో వ్యవహరిస్తున్నారని నిరసిస్తూ అపాయింట్ మెంట్ ఇచ్చేంత వరకు కదిలేది లేదని భీష్మించుకు కూర్చుకున్నారు. బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ బిసి వ్యతిరేక విధానాలు వీడాలంటూ నినాదాలు చేశారు. గవర్నర్ అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారని నినదించారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలయ్యే వరకు తమ పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కొద్ది సేపటి తర్వాత అక్కడ్నుంచి పోలీసులు వారిని బలవంతంగా అరెస్ట్ చేసి వాహనాల్లో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అంతకు ముందు మెట్రో రెసిడెన్సీ వద్ద రోడ్డు మీదే బైఠాయించిన నాయకులు, కార్యకర్తలను పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేసేందుకు చేసిన ప్రయత్నంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పెద్ద ఎత్తున మోహరించిన పోలీసులు నాయకులు, కార్యకర్తలను బలవంతంగా వాహనాల్లోకి ఎక్కించారు. ఈ క్రమంలో ఒక కార్యకర్త స్పృహ తప్పి పడిపోయారు. తమ నాయకులు శాంతియుతంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో వినతిపత్రం సమర్పించేందుకు వచ్చారని పోలీసులు వినిపించుకోలేదు. బలవంతంగా పోలీసులు వారిని అరెస్ట్ చేసి అక్కడ్నుంచి తరలించారు. ఈ క్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలకు దెబ్బలు తగిలాయి.

చర్చకు సిద్ధంగా లేని గవర్నర్ : జాన్ వెస్లీ

రాజ్ భవన్ వద్ద బైఠాయించిన సందర్భంగా జాన్ వెస్లీ మీడియాతో మాట్లాడారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు సిద్ధంగా లేని గవర్నర్ దానిపై కనీసం చర్చించేందుకు కూడా ఇష్టపడటం లేదని తెలిపారు. రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాల్సిన గవర్నర్ కేంద్రానికి అనుకూలంగా ఉంటున్నారని తెలిపారు. నెలన్నరకు పైగా బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు కాకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. మూడు రోజుల క్రితమే గవర్నర్ అపాయింట్ మెంట్ అడిగామనీ, బిసిల గురించి మాట్లాడేందుకు వస్తే కలవడానికి సిద్ధంగా లేరని విమర్శించారు. బిసిలకు, సామాజిక న్యాయానికి, రిజర్వేషన్లకు వ్యతిరేక వైఖరిని విడనాడాలని డిమాండ్ చేశారు. మనువాదంతో వ్యవహరిస్తూ కలిసేందుకు నిరాకరిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. శనివారం రాష్ట్ర వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మల దహనం, మోటార్ సైకిల్ ర్యాలీలు తదితర రూపాల్లో రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు పిలుపునిచ్చారు. గవర్నర్ తీరు మార్చుకోకుంటే ఆయన బదిలీ కోరాల్సి వస్తుందని హెచ్చరించారు.

బిజెపికి వ్యతిరేకంగా బంద్ చేస్తేనే...

బిజెపికి వ్యతిరేకంగా బిసి జెఎసి రాష్ట్ర బంద్ చేస్తేనే అందులో సిపిఎం పాల్గొంటుందని జాన్ వెస్లీ మరోసారి స్పష్టం చేశారు. ఛలో రాజ్ భవన్ ర్యాలీ ఖైరతాబాద్ వద్ద ప్రారంభానికి ముందు ఆయన మాట్లాడారు. బిసి రిజర్వేషన్ల బిల్లు కేంద్ర పరిధిలో ఉందనీ, రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్ లో చేర్చే అధికారం కేంద్రానికుందని తెలిపారు. గవర్నర్ ఆర్డినెన్స్ కు అనుకూలమా? వ్యతిరేకమా? అని చెప్పకుండా కేంద్రానికి పంపించారని ఆయన తప్పుపట్టారు. బిసి జెఏసి ఇచ్చిన రాష్ట్ర బంద్ కు మద్దతిచ్చిన బిజెపి కేంద్రంలో బీసీల 42 శాతం రిజర్వేషన్లను అడ్డుకుంటూ నాటకాలోడుతోందని జాన్ వెస్లీ ఆగ్రహం వ్యక్తం చేశారు. బంద్‌కు బిజెపి మద్దతివ్వడం మోసపూరితమని జాన్ వెస్లీ ఆరోపించారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ అమలు కావాలనే చిత్తశుద్ధి ఉంటే బిజెపికి వ్యతిరేకంగా బంద్ నిర్వహించాలని ఆయన సూచించారు. లేకపోతే సిపిఎం ఒంటరిగా రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. 18న నిరసనల తోనూ దిగిరాకపోతే కలిసొచ్చే శక్తులను కలుపుకుని రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అన్ని రాజకీయ పార్టీలు బిసిలకు సమాన అవకాశాలివ్వాలని కోరుకుంటున్న సమయంలో గవర్నర్ అడ్డుపడటం సరికాదని అభిప్రాయపడ్డారు. మతోన్మాద, కులోన్మాద, పురుషాధిక్య, కార్పొరేట్ల అనుకూల, మనవాద బిజెపిని బొంద పెట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

అఖిలపక్ష నిర్ణయాలకు ఒకేలి

రాష్ట్ర ప్రభుత్వం కేవలం న్యాయపోరాటాలకే పరిమితం కావడం సరిపోదని జాన్ వెస్లీ అభిప్రాయపడ్డారు. అందరిని కలుపుకుని కేంద్రంపై ఉద్యమం చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అఖిలపక్షం తీసుకునే నిర్ణయాలకు సిపిఎం మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఛలో రాజ్ భవన్ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, నాయకులు ఎస్ వీరయ్య, మహ్మద్ అబ్బాస్, టి జ్యోతి, టి సాగర్, నంద్యాల నర్సింహారెడ్డి, బండారు రవి కుమార్ పాల్గొన్నారు. రాష్ట్ర నాయకులు డిజి నరసింహారావు, ఎంవి రమణ, పి ఆశయ్య, ఆర్ శ్రీరాం నాయక్, టి స్కైలాబ్ బాబు, బి ప్రసాద్, ఉడుత రవీందర్, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు మేడ్చల్ జిల్లా కార్యదర్శి పి సత్యం, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పి యాదయ్య, హైదరాబాద్ నగర నాయకులు, హైదరాబాద్ సౌత్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

నామినేషన్ వేయడానికి భారీ ర్యాలీతో వెళుతున్న నవీన్ యాదవ్

మంత్రుల బృందంతో కలిసి నవీన్ యాదవ్ నామినేషన్ దాఖలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి వి నవీన్ యాదవ్ శుక్రవారం రెండు సెట్ల నామినేషన్ దాఖలు చేశారు. మొదటి సెట్ సీనియర్ నేత వి హనుమంత రావు, ఎంపి అనిల్ కుమార్ యాదవ్, కార్పొరేటర్ సిఎన్‌రెడ్డిలతో, రెండవ సెట్ మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్, గ్రేటర్ హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మీ, కాంగ్రెస్ నాయకులు హబీబా సుల్తానాలతో కలసి ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.సాయిరాంకు రెండు సెట్ల నామినేషన్ దాఖలు చేశారు. తెలంగాణ సంప్రదాయ పండగలైన బతుకమ్మ, బోనాల సందడి, మహిళల కళాకారుల నత్యాలు కోయ జాతుల డ్రమ్స్...కార్యకర్తల కోలాహలంతో భారీ జనసందోహం మధ్య శుక్రవారం నవీన్ యాదవ్ నామినేషన్ దాఖలు చేశారు. మొదట యూసుఫ్ గూడ చెక్ పోస్ట్ నుంచి శ్రీనగర్ కాలనీ మీదుగా భారీ ఊరేగింపుగా... షేక్ పేట్ తాసీల్దార్ కార్యాలయం చేరుకున్నారు. అంతకు ముందు నిర్వహించిన భారీ ర్యాలీలో మాజీ ఎంపి అజహరుద్దీన్, చైర్మన్లు రియాజ్, కార్పొరేటర్లు బాబా, సంగీత యాదవ్ తదితరులు పాల్గొన్నారు. చివర్లో హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ ఒవైసి వచ్చి నవీన్ యాదవ్‌ను ఆశీర్వదించడం కొసమెరుపు....

గ్రూప్-2 అభ్యర్థులకు నియామకపత్రాలు నేడే

- ముఖ్యఅతిథిగా సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిజిపిఎస్‌సి) ద్వారా ఎంపికైన గ్రూప్-2కు ఎంపికైన అభ్యర్థులకు శనివారం సాయంత్రం ఐదు గంటలకు హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి నియామక పత్రాలు అందించనున్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు డి శ్రీధర్‌బాబు, ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర్ రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, గడ్డం వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, వాకిటి శ్రీహరితోపాటు ప్రభుత్వ సలహాదారులు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారు. రాష్ట్రంలో 18 శాఖల్లో 783 పోస్టుల భర్తీకి 2022, డిసెంబర్ 29న గ్రూప్-2 నోటిఫికేషన్‌ను టీజీపీఎస్సీ విడుదల చేసిన విషయం తెలిసిందే. 783 గ్రూప్-2 పోస్టులకు 782 మంది అభ్యర్థులను ఎంపిక చేసింది.

నవంబర్ 11న జూబ్లీహిల్స్ పరిధిలో సెలవు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సందర్భంగా వచ్చేనెల 11న పోలింగ్ ఉన్నందున హైదరాబాద్ జిల్లాలోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం సెలవు ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు శుక్రవారం ఉత్తర్వులు (జిఓ నెంబర్ 1448) విడుదల చేశారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలకు సెలవు ఉంటుందని స్పష్టం చేశారు.

గన్ కల్చర్ తెచ్చిందే బిఆర్ఎస్

- అబద్ధాలతో దిగజారుతున్న హరీశ్‌రావు : మంత్రి సీతక్క

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో గన్ కల్చర్‌ను తెచ్చిందే బిఆర్ఎస్ పార్టీ అని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) విమర్శించారు. తల్లిదండ్రులపై ప్రమాణం చేసి చెబుతున్నా క్యాబినెట్ సమావేశంలో ఎలాంటి రాద్ధాంతమూ జరగలేదని స్పష్టం చేశారు. అందులో ప్రజా సమస్యలు, సంక్షేమపథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపైనే చర్చ జరిగిందని తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. తన తప్పుడు మాటలతో రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నంలో హరీశ్‌రావు ఉన్నారని విమర్శించారు. క్యాబినెట్ సమావేశంలో గొడవ జరిగిందని నిరూపిస్తావా? అని సవాల్ విసిరారు. "ఇబ్రహీంపట్నంలో రియల్ ఎస్టేట్ గొడవల్లో తుపాకులతో కాల్పులు జరిపితే ఇద్దరు చనిపోయారు. హరీశ్‌రావు నియోజకవర్గమైన సిద్ధిపేటలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఆవరణలో కాల్పులు జరిపి రూ.43 లక్షలు ఎత్తుకెళ్లారు. టిఆర్ఎస్ ప్రభుత్వం ఉండగానే అడ్వకేట్ వామనరావు దంపతులను నరికి చంపారు. అవినీతికి, అబద్ధాలకు, అహంకారానికి నిలువెత్తు నిదర్శనం బిఆర్ఎస్" అని విమర్శించారు. గతంలో కెసిఆర్ ప్రభుత్వంలో మంత్రులకు మాట్లాడే స్వేచ్ఛే లేదని, అంతా పంజరంలోని చిలుకల్లా ఉన్నారని గుర్తుచేశారు. ప్రజాప్రభుత్వంలో మంత్రులందరికీ స్వేచ్ఛ ఉందని, ప్రతి 15 రోజులకు ఒకసారి క్యాబినెట్ సమావేశం జరుగుతోందని చెప్పారు. హరీశ్‌రావు ఇప్పుడు ఓ పత్రిక అబద్ధపు కథనాలను అమ్మే సేల్స్‌మెన్‌గా మారిపోయారని విమర్శించారు. బిఆర్ఎస్ పార్టీలో ఇప్పుడు నాలుగు స్తంభాలాట నడుస్తోందని, అందుకే కెసిఆర్ ఫాంహౌస్ నుంచి బయటకు రావడం లేదని చెప్పారు.

డ్రగ్స్ నిర్మూలనకు సమన్వయం చేసుకోవాలి

- పోలీస్, ఆరోగ్యశాఖల అధికారులతో మంత్రి దామోదర

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో డ్రగ్స్‌ను పూర్తిగా నిర్మూలించేందుకు పోలీస్, వైద్యారోగ్యశాఖలు సమన్వయంతో పని చేయాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆ రెండు విభాగాల ఉన్నతాధికారులతో మంత్రి మత్తు పదార్థాల నిర్మూలనపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సమాజంలోని అన్ని వర్గాల భాగస్వామ్యం ఉంటేనే ఈ లక్ష్యాన్ని చేరుకోగలమన్నారు. వాటి నిర్మూలనకు ప్రజలందరు సహకరించాలని మంత్రి పిలుపునిచ్చారు. కేవలం ప్రభుత్వంతోనే నిర్మూలన సాధ్యం కాదని, అన్ని వర్గాలను పోరాటంలో భాగస్వాములు చేయాలని ఆయన సూచించారు. పిల్లలు మత్తు పదార్థాలకు అలవాటు పడకుండాతల్లిదండ్రులు, టీచర్లుజాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాటిని తీసుకుంటున్న వారిలో వచ్చే ప్రవర్తనలో వచ్చే మార్పులపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అవగాహన పెంచుకోవాలని కోరారు. ఈ దిశగా పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించాలని మంత్రి సూచించారు. ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు స్కూళ్లు, కాలేజీలు, హాస్పిటళ్లలో రెగ్యులర్‌గా కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి సూచించారు.

క్షేత్రస్థాయి ఆరోగ్య కార్యకర్తల ద్వారా గ్రామాల్లో, పట్టణాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని హెల్త్ సెక్రటరీకి మంత్రి సూచించారు. అన్ని విద్యా సంస్థల్లో యాంటి నార్కొటిక్స్ వింగ్స్ ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. డ్రగ్స్ వినియోగం నుంచి బయటపడేసేందుకు అవసరమైన డిఅడిక్షన్ సెంటర్లను బలోపేతం చేస్తున్నామని ఈ సందర్భంగా మంత్రి వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని టీచింగ్ హాస్పిటళ్లలో డీఅడిక్షన్ వార్డులు ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. ఎర్రగడ్డలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ ప్రాంగణంలో అత్యాధునిక వసతులతో డిఅడిక్షన్ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకొస్తామని, అలాగే అవసరాన్నిబట్టి మరిన్ని సెంటర్లు ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. మత్తు పదార్థాలకు అలవాటైన పిల్లలను తల్లిదండ్రులే డీఅడిక్షన్ సెంటర్లకు తీసుకురావాలని మంత్రి కోరారు. పూర్తి ఉచితంగా వారికి కౌన్సెలింగ్, చికిత్స అందిస్తామని తెలిపారు. పిల్లలకు మత్తు పదార్థాలకు అలవాటైనట్టు గుర్తించాక ఆలస్యం చేయొద్దనీ, ఆలస్యమయ్యేకొద్దీ వారి ఆరోగ్యం మరింత పాడయ్యే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు.

రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలనకు తీసుకుంటున్న చర్యల గురించి తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య మంత్రికి వివరించారు. మత్తు పదార్థాలకు అలవాటైన వారిని గుర్తించి మెజిస్ట్రేట్ ముందు హాజరు పరుస్తున్నామనీ, ఆ తర్వాత వారిని డిఅడిక్షన్ సెంటర్లకు తరలించి చికిత్స అందిస్తున్నామని తెలిపారు. మత్తు పదార్థాలకు బానిసలు అయినవారిని గుర్తించేందుకు ఆరోగ్యశాఖ సహకారం తీసుకుంటున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో హెల్త్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, డ్రగ్ కంట్రోల్ అథారిటీ డైరెక్టర్ జనరల్ షానవాజ్ ఖాసీం, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్, వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్, టిఎన్‌బి ఎస్‌పి రూపేశ్, ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ సూపరింటెండెంట్, డాక్టర్ అనిత, న్యాయ శాఖ అడిషనల్ సెక్రటరీ సునీత పాల్గొన్నారు.

తెలంగాణ జాగృతిలో పలువురు నాయకుల చేరిక

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ జాగృతిలో వివిధ పార్టీల నాయకులు చేరారు. శుక్రవారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉప్పల్, నాంపల్లి, చార్మినార్ నియోజకవర్గాలకు చెందిన నాయకులకు జాగృతి అధ్యక్షులు కల్వకుంట్ల కవిత కండువాలు కప్పి ఆహ్వానించారు. జాగృతి నాయకులు గోపు సదానందం, పడాల మనోజ్ గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు శర్మన్, సురేశ్ రామారావు, సతీశ్, అనిల్, రాజు, బాలకృష్ణ, కృష్ణా నాయక్, రాములు తదితరులు చేరిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, నాయకులు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యులపై దాడులను ఆపాలి

గ్రామీణ వైద్యులపై దాడులను ఆపాలని కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. తెలంగాణ గ్రామీణ వైద్యుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఎండి హుస్సేన్, నాయకులు నర్సింహ ఆధ్వర్యంలో శుక్రవారం పలువురు గ్రామీణ వైద్యులు కల్వకుంట్ల కవితను కలిసి తమ సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా 60 వేల మందికిపైగా గ్రామీణ వైద్యులు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రథమ చికిత్సలు మాత్రమే చేస్తున్నామని తెలిపారు. అయినా తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు, అధికారులు తరచూ తమ హెల్త్ సెంటర్లపై దాడులు నిర్వహిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. కవిత స్పందిస్తూ గ్రామీణ వైద్యులను ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేయొద్దని, వారి సేవలకు తగిన గుర్తింపునివ్వాలని కోరారు.

ఫ్రాన్స్‌లో ఇండియా రాయబారిని కలిసిన స్పీకర్ బృందం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫ్రాన్స్ దేశ రాజధాని ప్యారిస్‌లోని భారతదేశ రాయబారి చీఫ్ అంబాసిడర్ సంజీవ్‌సింఘాలాతో స్పీకర్ బృందం సమావేశమైంది. పోచంపల్లి పట్టు శాలువాతో ఆయన్ను సన్మానించారు. బార్బడోస్ దేశంలో జరిగిన 68వ కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ కాన్ఫరెన్స్ అనంతరం స్టడీ టూర్‌లో భాగంగా ఆ బృందం ఫ్రాన్స్‌లో పర్యటిస్తున్నది. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ చైర్మెన్ బండా ప్రకాష్ ముదిరాజ్, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి. నరసింహాచార్యులు బృందంలో ఉన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ భారతదేశంలో తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా గుర్తింపు పొందిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహిస్తూ పెట్టుబడులను ఆకర్షిస్తున్నదని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులకు తమ వంతుగా ప్రయత్నం చేస్తామని సింఘాలా ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

పోడు పట్టాలున్న రైతులకు పంట రుణాలివ్వండి

- సిఎం ముఖ్యకార్యదర్శి శేషాద్రికి రైతు కమిషన్ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పోడు పట్టాలున్న రైతులకు పంట రుణాలివ్వాలని రైతు కమిషన్ బృందం ముఖ్యమంత్రి కార్యదర్శి శేషాద్రిని కోరింది. ఇప్పటికే సంబంధిత శాఖ అధికారులతో పంట రుణాలపై చర్చించినట్టు పేర్కొంది. శుక్రవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ముఖ్య కార్యదర్శి శేషాద్రితో రైతు కమిషన్ చైర్మెన్ కోదండరెడ్డి, సభ్యులు గోపాల్‌రెడ్డి, గడుగు గంగాధర్, భూమి సునీల్ కుమార్, మెంబర్ సెక్రెటరీ గోపాల్, ఏవో హరివెంకట ప్రసాద్ భేటీ అయ్యారు. వివిధ అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో పోడు పట్టాలున్న 2.50 లక్షల గిరిజన రైతులకు రుణాలు, పంట రుణాలు ఇవ్వడం వల్ల ఏజెన్సీ రైతులకు ఎంతో మేలు చేసినట్టు అవుతుందని తెలిపారు. పోడు పట్టాలున్న భూములు దాదాపు ఏడు లక్షల ఎకరాలను భూ భారతికి అనుసంధానం చేయాలని కోరారు. విత్తనోత్పత్తి రైతులు ఎదుర్కుంటున్న సమస్యలు, నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోతున్న విషయాలను ఈ సందర్భంగా వివరించారు. సమగ్ర విత్తన చట్టం వస్తేనే ఈ సమస్యలు పరిష్కారమవుతాయని గుర్తు చేశారు. అసైన్‌మెంట్ భూములకు పూర్తి పట్టా హక్కులు కల్పించడం, కౌలుదారుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

భూపరిపాలనలో మరో ముందడుగు

- ప్రతి మండలానికి లైసెన్స్‌డ్ సర్వేయర్లు
- 19న ముఖ్యమంత్రి ద్వారా లైసెన్సుల పంపిణీ
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతాంగానికి మెరుగైన సేవలందించడానికి, రాష్ట్రంలో భూములకు సంబంధించిన అనేక పంచాయితీలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో రెవెన్యూ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో రెవెన్యూశాఖ కార్యదర్శి డిఎస్ లోకేష్‌కుమార్, సర్వే విభాగం కమీషనర్ రాజీవ్ గాంధీ హనుమంత్‌తో కలిసి ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ఇప్పటికే గ్రామపాలనాధికారులు (జిపిఓ)ను అందుబాటులోకి తీసుకురాగా, తాజాగా క్షేత్రస్థాయిలో ప్రజలకు సులభంగా భూ సేవలు అందేలా ప్రతి మండలానికి కనీసం నాలుగు నుంచి ఆరుగురు లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. ఈ నెల 19న శిల్ప కళావేదికలో సీఎం చేతుల మీదుగా శిక్షణ పొందిన లైసెన్స్‌డ్ సర్వేయర్లకు లైసెన్స్‌లు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన భూభారతి చట్టంలో రిజిస్ట్రేషన్ సమయంలో భూమి సర్వే మ్యాప్‌ను జత పరచడాన్ని తప్పనిసరి చేసిన నేపథ్యంలో సర్వే విభాగం పాత్ర మరింత క్రియాశీలం కానుందన్నారు. భూభారతి చట్టంలో పేర్కొన్నవిధంగా ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలంటే ప్రస్తుతమున్న 350 మంది సర్వేయర్లు సరిపోరనీ, మరికొంత మంది అవసరమవుతారని తెలిపారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని లైసెన్స్‌డ్ సర్వేయర్లను తీసుకోవడం, ఆ విభాగంలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ, అవసరమైన అత్యాధునిక పరికరాలను అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అవసరమైన సర్వేయర్లను అందుబాటులోకి తీసుకురావడానికి దరఖాస్తులను ఆహ్వానించగా పది వేల మంది దరఖాస్తు చేసుకున్నారనీ, తొలివిడతలో ఏడు వేల మందికి శిక్షణ ఇచ్చామని వివరించారు. ఇందులో 3,465 మంది అర్హత సాధించారని తెలిపారు. భూ విస్తీర్ణాన్ని బట్టి ప్రతి మండలానికి 4 నుంచి 6 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమిస్తామని పేర్కొన్నారు. రెండో విడతలో మరో మూడు వేల మందికి ఆగస్టు 18 నుంచి శిక్షణను ప్రారంభించామనీ, ఈనెల 26న జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో అర్హత పరీక్ష నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ఈ పరీక్షలో అర్హత సాధించిన వారికి 40 రోజుల పాటు అప్రెంటిస్ శిక్షణ ఉంటుందనీ, వీరి సేవలు కూడా డిసెంబర్ రెండో వారం నాటికి అందుబాటులోకి వస్తాయని చెప్పారు. భూముల కొలతలు, రికార్డులు స్పష్టంగా ఉన్నప్పుడే వివాదాలు తగ్గుతాయనీ, సర్వే వ్యవస్థ బలపడితేనే ప్రజలకు భద్రత, న్యాయం లభిస్తుందన్నారు. గత పదేండ్లుగా సర్వే విభాగం నిర్లక్ష్యానికి గురైందనీ, క్షేత్రస్థాయిలో సిబ్బంది లేకపోవడం వల్ల ప్రజలకు తగిన సేవలు అందలేదని విమర్శించారు. ప్రతి రెవెన్యూ గ్రామంలో జిపిఓలు, ప్రతి మండలంలో లైసెన్స్‌డ్ సర్వేయర్లు ఈ రెండు చర్యలతో ప్రజలకు అవసరమైన భూ సంబంధిత సేవలు అందేలా వ్యవస్థను పటిష్టం చేయడమే లక్ష్యమని స్పష్టం చేశారు. భూమి రికార్డులు స్పష్టంగా ఉండేలా, ప్రజలకు ఇబ్బంది లేకుండా, అవినీతి లేని సేవలు అందించడమే తమ ప్రభుత్వ సంకల్పమని మంత్రి పొంగులేటి చెప్పారు.

క్రిస్టియన్ల పట్ల బిఆర్ఎస్ నిర్లక్ష్యం

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన బిఆర్ఎస్ క్రిస్టియన్ల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిందని మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం సికింద్రాబాద్‌లోని వెస్లీ కాలేజీలో జరిగిన క్రైస్తవ ఆత్మీయ సమ్మెళనంలో ఆయన పాల్గొన్నారు. క్రిస్టియన్, దళితులు, మైనార్టీలు, పేద వర్గాలకు అండగా కాంగ్రెస్ ఉందని తెలిపారు. క్రైస్తవులకు రంగారెడ్డి, కీసర, శంషాబాద్‌లో కేటాయించిన భూమి విషయంపై నూటికి నూరు శాతం సిఎం దృష్టికి తీసుకెళ్లి భూములు అందిస్తామని చెప్పారు. జూబ్లీహిల్స్‌లో దళిత, క్రిస్టియన్, మైనార్టీ వర్గాలు కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ కు ఓటు వేసి అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఆ నియోజక వర్గ పరిధిలో 200 పైగా చర్చీలు ఉన్నాయనీ, వీరికి ఏ సమస్య ఉన్నా ప్రభుత్వం పరిష్కరిస్తున్నదని తెలిపారు. కార్యక్రమంలో కాంచీపురం పార్లమెంట్ సభ్యులు, జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ఇన్‌చార్జ్ పి విశ్వనాథ్ మాట్లాడుతూ లౌకిక విలువలకు కట్టుబడి కాంగ్రెస్ పనిచేస్తున్నదని చెప్పారు. ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలపరచే దిశగా పనిచేస్తోందని తెలిపారు.

IN THE COURT OF THE MACT CUM XXV ADDL. CHIEF JUDGE CITY CIVIL COURT, AT: HYDERABAD
MV.O.P.No. 984 OF 2025

BETWEEN:
Pathlavath Kavitha and others. ..Petitioners.
AND
Asif Mohammad and another. ...Respondents.

To,
Asif Mohammed S/o Mohammed Sirajuddin Siddiqui, Age: Major, Owner cum Driver of Private bus bearing No.TS-12-UD-6401, R/o: H.No.6-4-92/7/1/C, Old Palamoor Village, Mahaboobnagar District, TG - 509 001. ...Respondent No.1.

Please take notice that the petitioners have filed the above O.P. against you No.1 and other respondents for claiming compensation for deceased Patlavath Vinod Kumar S/o Patlavath Narsimha who died in the road accident which was occurred on 23-02-2025 at about 08:00 hours at near Danthuri Estate, on NH-44 road, Kashireddyguda Village Shivar, Farooqnagar Mandal, Cyberabad by the respondent's No.1 vehicle i.e., Private bus bearing No.TS-12-UD-6401. The said O.P. is posted to **10.11.2025** at **10.30** AM for your appearance and counter. Kindly make it convenient to be present on the said date before this Hon'ble Court by 10.30 AM in person or through your counsel, failing which the matter will be decided on your obsence.
Hence this notice.

//BY ORDER OF THE COURT//
M. VIJAY REDDY
ADVOCATE
2-2-647/A/58, Saibabanagar, Shivam Road, Bagh Amberpet, Hyderabad
Ph: 7673904549
9330489999

IN THE COURT OF THE HONOURABLE II ADDITIONAL CHIEF JUDGE CITY CIVIL COURT AT :: HYDERABAD
E.P.No. 158 of 2025 In O.S. No. 321 of 2015

BETWEEN:
1. Tahera Begum W/o Late Syed Aziz Ahmed Aged about 65 years, Occ. Household, R/o SRT No. 730, Municipal No. 7-2-985 Industrial Housing Colony, Sanathnagar, Hyderabad-500 018. ...Decree Holder/ Plaintiff
AND
1.Alwala S. Suryanarayana, S/o A. Sathyanarayana H. No. SRT 730, 7-2-985, Sanathnagar, Hyderabad 500 018.
2.Yedla Pandaiah, S/o Late Rama kistam H.No. 7-1-307/14/512, Subhashnagar Sanathnagar, Hyderabad-500 018 ...Judgment Debtors/Respondents

To,Shri Yedla Pandaiah, S/o Late Ramakistam, H. No. 7-1-307/14/512, Subhashnagar, Sanathnagar, Hyderabad 500 018

Please take notice that the above E.P. No. 158 of 2025 is filed by the DHr / Plaintiffs against the JDr/Defendants for eviction of Suit Scheduled Premises i.e. All that GROUND FLOOR SHOP ADMEASURING ABOUT 150 S.ft. IN SRT 730, H. No. 7-2-985, Industrial Housing Colony, Sanatnagar Hyderabad which is bounded by
North: Part of SRT No. (H.No. 7-2-985)
South: SRT No. 731.
East: Road.
West: Part of SRT No. 730 (H.No. 7-2-985)
and to deliver the peaceful possession of the above mentioned schedule premises which is in the occupancy of the JDRs/ Defendants and their men carrying on mineral water any other business immediately as per OR XXI Rule 35 and 36 of CPC and the said matter is posted on 11-11-2025 at 10-30 a.m. for your appearance and counter. Should you fail to appear on **11-11-2025** at **10-30** a.m. before the above said Hon'ble Court either in person or through your advocate, the matter will be decided exparte as per law.

[BY ORDER OF THE HONOURABLE COURT]
G.SUDHA,
Counsel for D.Hr. s/Plaintiffs,
H.No. 10-3-16/2, Humayun Nagar, Hyderabad 500 028. Cell: 99858 04288,
E mail: sudhaghatrazu@gmail.com

చీకటిపై వెలుగు విజయం దీపావళి

ప్రజాశక్తి కల్చరల్

చీకటిపై వెలుగు విజయం దీపావళి అని భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ ఏనుగు నరసింహా రెడ్డి అన్నారు రవీంద్ర భారతి లోని సాంస్కృతిక శాఖ కార్యాలయంలో దీపావళి పండుగ వేడుక కన్నుల పండుగగా జరిగింది డాక్టర్ ఏనుగు నరసింహా రెడ్డి సిబ్బందితో కలసి ప్రమిదలలో జ్యోతి వెలిగించి శుభాకాంక్షలు తెలిపారు మన జీవితాలలో సద్భావన సానుకూలత సహకార భావం వెల్లివిరియాలి అన్నారు. సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి సాంస్కృతిక శాఖ అధికారులు రఘు నందన్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం పెంపులో అటవీశాఖ అధికారుల పనితీరు భేష్

- అటవీశాఖ రాష్ట్రస్థాయి క్రీడా పోటీల ప్రారంభంలో షూటర్ ఈషాసింగ్
- నవంబర్ రెండో వారంలో అటవీశాఖ జాతీయ క్రీడలు : వైల్డ్ లైఫ్ చీఫ్ ఇలు సింగ్ మేరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పచ్చదనం పెంపులో అటవీశాఖ అధికారుల పనితీరు భేష్ అని ప్రముఖ షూటర్ ఈషాసింగ్ కొనియాడారు. శుక్రవారం హైదరాబాద్ సమీపంలోని దూలపల్లి ఫారెస్ట్ అకాడమీలో తెలంగాణ అటవీ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి అటవీ సిబ్బంది క్రీడా పోటీలను అటవీ శాఖ వన్యప్రాణి ప్రధాన సంరక్షిణాధికారి(వైల్డ్ లైఫ్ చీఫ్) ఈలు సింగ్ మేరుతో కలిసి ఈషా సింగ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..

గొప్ప కార్యక్రమానికి ఆహ్వానించడం గర్వంగా ఉందన్నారు.. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వనమహోత్సవంలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు.. దానిద్వారా అడవుల పెరుగుదలతో పాటుగా పర్యావరణ పరిరక్షణ మెరుగవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈలుసింగ్ మేరు మాట్లాడుతూ.. వన్యప్రాణుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ వంటి కఠిన బాధ్యతలను అటవీ సిబ్బంది నిర్వర్తిస్తున్నారని తెలిపారు. శారీరకంగా దృఢంగా ఉండటంతో పాటుగా మానసికంగా కూడా ఆరోగ్యంగా ఉండేందుకు ఏటా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని కాపాడాలని కోరారు. చిన్న వయసులోనే ఈషా సింగ్ అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణకు గౌరవం తెచ్చి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. రాష్ట్రంలోని ఏడు జోన్ల నుంచి 750 మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఆటగాళ్లు నవంబర్ రెండో వారంలో డెహ్రాడూన్‌లో జరిగే జాతీయ క్రీడల పోటీల్లో పాల్గొంటారని ప్రకటించారు. కార్యక్రమంలో సిసిఎఫ్‌లు శర్వణన్, రామలింగం, ప్రియాంక వర్గీస్, ప్రభాకర్, భీమానాయక్, అకాడమీ డైరెక్టర్ ఎస్‌జె. ఆశ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

గొర్రెల మందను ఢీకొన్న గ్రానైట్ లారీ

- 16 గొర్రెలు మృత్యువాత

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలం మాటేడు గ్రామ శివారులో శుక్రవారం ఉదయం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో 16 గొర్రెలు మృత్యువాతపడ్డాయి, రెడ్లవాడ నుంచి తొర్రూరు మీదుగా ఖమ్మం వైపు వేగంగా వెళ్తున్న గ్రానైట్ లారీ.. మేతకు తీసుకెళ్తున్న గొర్రెల మందను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన బొల్లం వీరయ్యకు చెందిన 16 గొర్రెలు అక్కడికక్కడే మృత్యువాతపడ్డాయి. కొన్ని గొర్రెలకు తీవ్రగాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే గ్రామస్తులు అక్కడికి చేరుకొని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి లారీని స్వాధీనం చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

సమస్యల 'వల'యంలో మత్స్య కళాశాల

- పాలకుల తీరుతో కళాశాల భవిష్యత్ ప్రశ్నార్థకం
- సీడ్ తల్లి చేపల పెంపకానికి 20 ఎకరాలు అవసరం
- 17 మంది ప్రొఫెసర్లకు ఉన్నది 12 మందే..
- నాలుగు బ్యాచ్‌లు బయటకు వెళ్లినా ఉద్యోగాల్లేవ్..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నీలి విప్లవమే ప్రధాన లక్ష్యంగా మత్స్య సంపదను పెంచి పౌష్టికాహారం అందించడంలో భాగంగా ప్రభుత్వం 2017లో వనపర్తి జిల్లా పెబ్బేరులో మత్స్య కళాశాలను ప్రారంభించింది. ప్రారంభంలోనే సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు, ప్రొఫెసర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎనిమిదేండ్ల నుంచి అదే పరిస్థితి. ప్రభుత్వం మారినా సమస్యలు పరిష్కారం కావడం లేదు. కళాశాలకు రహదారి, భూమి ఫినిషింగ్, ఫామ్‌పాండ్స్ లేవు.. గుట్టలతో కూడిన భూముల దాకా అనేక సమస్యలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కళాశాలకు ఇచ్చిన 60 ఎకరాల భూమిలో 4.5 ఎకరాలు మాత్రమే అనుకూలంగా ఉంది. మిగతా భూమి అంతా గుట్టలుగా ఉంటుంది. నాలుగేండ్లు కష్టపడి డిగ్రీ పూర్తి చేసినా ఇప్పటివరకూ నోటిఫికేషన్ లేక ఒక్కరికీ ఉద్యోగం రాలేదని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

పెబ్బేరు పట్టణానికి వెళ్లి తిరిగి రావాలంటే ప్రయివేటు వాహనాలు నాలుగు కిలోమీటర్లకు రూ.200 చార్జి వసూలు చేస్తుంటారు. వర్షాలు పడితే వాహనాలు రావడానికి రోడ్డు సరిగా లేదు. జూరాల నుంచి వచ్చే ఎడమ కాల్వ బ్రిడ్జి శిథిలావస్థలో ఉంది. తల్లి చేపలను పెంచడానికి ఫామ్‌పాండ్స్ కోసం 20 ఎకరాలు అవసరం ఉంటుంది. కానీ గుట్టల వల్ల ఉపయోగంలో లేని పరిస్థితి. చేపల పెంపకానికి అనువైన భూమి లేక విద్యార్థులకు ప్రాక్టికల్స్ నిర్వహించలేని పరిస్థితి నెలకొన్నది. ఖమ్మం, కాకినాడకు తీసుకెళ్లి విద్యార్థులకు ప్రాక్టికల్స్ చేయిస్తున్నారు. ఈ క్రమంలో ఆ భూమినే కొందరు కబ్జా చేస్తుండగా.. మరికొందరు క్వారీలు నిర్వహించి రాళ్లను తరలిస్తున్నారు.. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు.

కళాశాలలో కోర్సులు

ఆక్వా కల్చర్, ఆక్వాటిక్ అనిమల్ హెల్త్ మేనేజ్‌మెంట్, ఫిషరీస్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఆక్వాటిక్ ఎన్విరాన్‌మెంట్, ఫిష్ ప్రాసెసింగ్ టెక్నాలజీ, ఫిషరీస్ ఇంజినీరింగ్. ఫిషరీస్ ఆక్వా టెన్షన్, ఫిషరీస్ ఎకనామిక్ అండ్ స్టాటిస్టిక్స్ తదితర కోర్సులు ఉన్నాయి. ఒక్కో విభాగానికి ఇద్దరు ప్రొఫెసర్లు ఉండాలి. మొత్తం 17 మంది ప్రొఫెసర్లకుగాను 15 మంది మాత్రమే ఉన్నారు. ఇందులో ఏడు మంది కాంట్రాక్టు ప్రొఫెసర్లు ఉన్నారు. ఐదుగురు మాత్రమే శాశ్వత ప్రొఫెసర్లు విధులు నిర్వహిస్తున్నారు. ఒకరు ఏవో, మరొకరు హెడ్, 12 మంది స్కావెంజర్లు, నలుగురు అటెండర్లు పనిచేస్తున్నారు. ఒక విభాగంలో 80 మంది విద్యార్థులు ఉంటే 560 మంది విద్యార్థులు చదువుకోవాలి. వసతుల లేని కారణంగా 81 మంది విద్యార్థులే ప్రస్తుతం చదువుకుంటున్నారు.

కౌన్సెలింగ్ తర్వాత కళాశాలలో చేరడం లేదు

విద్యార్థులు అడ్మిషన్ సమయంలో పేర్లను నమోదు చేసుకుంటారు. కౌన్సెలింగ్ తర్వాత కళాశాలకు రోడ్డు, ఫామ్‌పాండ్స్ వసతులు, ప్రొఫెసర్ల కొరత తదితర సమస్యలను దృష్టిలో పెట్టుకొని కళాశాలలో చేరడం లేదు. ముఖ్యంగా కళాశాల నుంచి నాలుగు బ్యాచులు బయటకు వచ్చినా వారికి ఎక్కడా ఇంకా ఉద్యోగాలు రాలేదు. దీంతో విద్యార్థులు ఆ కోర్సులపై ఆసక్తి చూపడం లేదు.

రాళ్లు గుట్టల్లో ఫామ్‌పాండ్స్ ఎలా ?

చేపలు పెంపకానికి ఫామ్‌పాండ్స్ అవసరం. మత్స్యకళాశాలకు కేటాయించిన స్థలం గుట్టలతో కూడుకున్నది. వాటిని తొలగించాలంటే కోట్లలో ఖర్చవుతుంది. కళాశాల నిర్వహణ ఖర్చుతో కూడుకున్న పని. ఈ పరిస్థితుల్లో భూమిని చదును చేసే అవకాశాలు లేవు. ఫామ్‌పాండ్స్ నిర్మించకుండా విద్యార్థులకు ప్రాక్టికల్స్ ఎలా నిర్వహించాలో తెలియక ప్రొఫెసర్లు తలలు పట్టుకుంటున్నారు.

ఖాళీల భర్తీ ఎప్పుడు?

మత్స్య కళాశాల నిర్వహణకు సరిపడా ప్రొఫెసర్లు లేరు. ఉమ్మడి రాష్ట్రంలో 2011లో ఒకసారి నోటిఫికేషన్ వేశారు. 32 పోస్టులు ఉండేవి. క్రమంగా తగ్గుతున్నాయి. ఉద్యోగ విరమణ చెందిన స్థానంలో కొత్త వారి నియామకం చేపట్టడం లేదు. వెటర్నరీ శాఖలో ఉన్న వారిని ఫిషరీస్ కళాశాలకు సిబ్బందిగా నియమించి నడిపిస్తున్నారు. అనుబంధ రంగాల నుంచి నిపుణులను తీసుకున్నప్పటికీ కళాశాలకు సరైన న్యాయం జరగడం లేదు.

సాంకేతిక సమస్యలు

మత్స్య కళాశాలలో సాంకేతిక సమస్యలు అనేకం ఉన్నాయి. ప్రధానంగా విద్యార్థులకు నెట్‌వర్క్ సౌకర్యం లేదు. సిగ్నల్స్ ఉండవు. ప్రాసెసింగ్ యూనిట్లు లేవు. స్టాకు గోదాములు ఉంటే చేప చెడిపోదు. ప్రాసెసింగ్ యూనిట్‌లు లేకపోతే మాంసం చెడిపోయి ప్రాణాంతకంగా మారే అవకాశాలున్నాయి.

ప్రత్యామ్నాయ మార్గాలు

మత్స్య కళాశాలలో డిగ్రీ పూర్తి చేసిన వారు ఉద్యోగాలు లేకపోతే ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టాల్సి ఉంటుంది. చేపల ఫామ్‌పాండ్స్ ఏర్పాటు చేసి సీడ్ తల్లి చేపలను, మాంసం చేపలను పెంచి ఆదాయం పొందొచ్చు.

ఉద్యోగం వస్తుందని నమ్మించారు

వశిష్ట, డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థి, వికారాబాద్ జిల్లా

మత్స్య కళాశాలలో డిగ్రీ పూర్తి చేస్తే ఉపాధి అవకాశాలుంటాయన్నారు. 2011 నుంచి ఇప్పటివరకు ఒక్క నోటిఫికేషన్ కూడా వేయలేదు. ఇప్పటివరకు మత్స్య కళాశాల నుంచి నాలుగు బ్యాచులు బయటకు వెళ్లాయి. ఏ ఒక్కరికీ ఉద్యోగం రాలేదు.

నోటిఫికేషన్ వేసి ఖాళీలు భర్తీ చేయాలి

జయసూర్య, గుంటూరు జిల్లా

కళాశాలలో డిగ్రీ పూర్తి చేసిన వారికి ఉద్యోగ భరోసా లేదు. ఇప్పటికే 4 బ్యాచులు బయటికి పోయాయి. ఎవరికీ ఉద్యోగం రాలేదు. వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. నోటిఫికేషన్ వేసి కళాశాలలో ఖాళీలు భర్తీ చేయాలి.

ప్రాక్టికల్స్ కోసం వేరే ప్రాంతానికి..

దివ్య, కాకినాడ

కళాశాలలో భూమి ఉన్నా ఫామ్‌పాండ్స్‌కు అనుకూలంగా లేదు. నీరు లేదు. ఇక్కడ భూమి చదును చేసి పాండ్స్ ఏర్పాటు చేయాలి.

ఖాళీలను భర్తీ చేయాలి

మత్స్య కళాశాల ఎడి శాకార్, పెబ్బేరు

రాష్ట్ర ప్రభుత్వం మత్స్య కళాశాలలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలి. చేపల పెంపకానికి అనుకూలంగా గుట్టలను తొలగించి ఫామ్‌పాండ్స్ ఏర్పాటు చేయాలి. డిగ్రీ పూర్తి చేసిన వారికి నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగాలు కల్పించాలి. కళాశాలకు రహదారి ఏర్పాటు చేసి బస్సు వచ్చేలా చేయాలి. మత్స్య కళాశాలలో చదివే విద్యార్థులకు ప్రాక్టికల్స్ తరగతులు ఇక్కడే జరిగేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలి. ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా చూడాలి.

నేడు రాష్ట్రబంద్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బిసి జెఎసి శనివారం రాష్ట్రబంద్‌కు పిలుపునిచ్చింది. సకలజనులు ఈ బంద్‌లో పాల్గొనాలని విజ్ఞప్తి చేసింది. బిసిల ఆకాంక్షలు ఢిల్లీకి వినిపించేలా నిర్వహించనున్నట్టు ప్రకటించింది. ఈ బంద్‌కు మద్దతునివ్వాలంటూ అన్ని రాజకీయ పార్టీలనూ బిసి జెఎసి ప్రతినిధులు కలిసి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రబంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. అన్ని రాజకీయ పార్టీలూ ఈ బంద్‌కు మద్దతు ప్రకటించాయి. కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి, సిపిఐ, సిపిఎం, టిజెఎస్, సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, తెలంగాణ జాగృతి, ఇతర సామాజిక, ప్రజా, బిసి సంఘాలు మద్దతునిచ్చాయి. అయితే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుకు నిరసనగా సిపిఎం ఆధ్వర్యంలో శనివారం రాష్ట్రవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు, బైక్ ర్యాలీలు నిర్వహించనున్నట్టు ప్రకటించింది. రాష్ట్రబంద్ నేపథ్యంలో ప్రయివేటు పాఠశాలలు, కాలేజీ యాజమాన్యాలు స్వచ్ఛందంగా సెలవులు ప్రకటించాయి. రాష్ట్రంలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తామంటూ కామారెడ్డి డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో హామీ ఇచ్చింది. అందుకనుగుణంగా బీసీల రిజర్వేషన్లకు సంబంధించి అసెంబ్లీలో బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపించింది. ఆర్నెల్లైనా కేంద్ర ప్రభుత్వం ఆమోదించలేదు. అయితే రాష్ట్ర మంత్రివర్గం ఆర్డినెన్స్‌ను ఆమోదించి గవర్నర్‌కు పంపించింది. దాన్ని కూడా కేంద్ర ప్రభుత్వానికి పంపించారు. ఆర్డినెన్స్‌పైనా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. బీసీ రిజర్వేషన్ల బిల్లు, ఆర్డినెన్స్‌పై కేంద్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ జీవో9ని విడుదల చేసింది. ఆ జీవో ఆధారంగా రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించింది. ఆ జీవోను సవాల్ చేస్తూ రెడ్డి జాగృతి హైకోర్టును ఆశ్రయించింది. ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు జిఒ 9పై స్టే విధించింది. దీంతో స్థానిక సంస్థల ఎన్నికలు ఆగిపోయాయి. హైకోర్టు స్టేను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్‌లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పి)ని దాఖలు చేసింది. అయితే సుప్రీంకోర్టు ఆ స్టేను సమర్థించింది. ఎస్ఎల్‌పిని తిరస్కరించింది. ఈ నేపథ్యంలో బిసి జెఎసి ఆధ్వర్యంలో శనివారం తలపెట్టిన రాష్ట్రబంద్‌కు ప్రాధాన్యత సంతరించుకుంది. కాంగ్రెస్, బిజెపి మద్దతు ఇస్తుండడంతో బిసి రిజర్వేషన్లకు అడ్డుగా ఉన్నది ఎవరు?అనే ప్రశ్న అందరిలోనూ తలెత్తుతున్నది. రాష్ట్రబంద్ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకమా?, రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకమా? లేదంటే కోర్టులకు వ్యతిరేకమా?అని బీసీ జేఏసీని పలువురు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం డెడికేషన్ కమిషన్ ద్వారా కులగణన చేపట్టి దాని ఆధారంగా బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను ఇవ్వాలని నిర్ణయించింది. అందులో భాగంగానే అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించింది. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద కాంగ్రెస్ పార్టీ ధర్నా చేపట్టింది. కేంద్రం ఆమోదించకపోవడం వల్లే రాష్ట్ర ప్రభుత్వం జిఒ 9ని విడుదల చేసింది. హైకోర్టు స్టేపై సుప్రీంకోర్టును ఆశ్రయిం చింది. బిసిలకు రిజర్వేషన్లను కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నదని పలు రాజకీయ పార్టీలు, బిసి సంఘాలు చెప్తున్నాయి. అయితే బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించాలన్న బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆమోదించాలి. లేదంటే పార్లమెంటులో బిల్లు ఆమోదించి రాజ్యాంగంలో తొమ్మిదో షెడ్యూల్‌లో బీసీ రిజర్వేషన్లను చేరిస్తే శాశ్వత పరిష్కారం లభిస్తుందని బిసి మేధావులు సూచిస్తున్నారు. అసెంబ్లీలో బిసి బిల్లును ఆమోదించిన బిజెపి కేంద్రంలో మాత్రం ఆ పని చేయకుండా అడ్డుకుంటుండడం గమనార్హం. ఇప్పుడు బిసి రిజర్వేషన్లకు సంబంధించి బంతి కేంద్ర ప్రభుత్వంలో ఉన్నది. కేంద్రం ఆమోదిస్తేనే బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలవుతాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఢిల్లీకి తీసుకెళ్లాలని పలు పార్టీలు కోరుతున్నాయి.

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌కు మద్దతు : సిపిఐ

- మఖ్దూంభవన్‌కు వచ్చిన టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు సిపిఐ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. శుక్రవారం హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌కు టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ వచ్చారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, కంట్రోల్ కమిషన్ చైర్మెన్ కె నారాయణ, రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, ఈటి నరసింహ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, పశ్యపద్మ, కలవేణ శంకర్, ఎం బాలనర్సింహ, భాగం హేమంతరావు, విఎస్ బోస్, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో భేటీ అయ్యారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు, బిసి రిజర్వేషన్లపై చర్చించారు.

ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతునివ్వాలని సిపిఐని మహేష్‌కుమార్‌గౌడ్ కోరారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గంలో చర్చించి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతునివ్వాలని నిర్ణయం తీసుకున్నామని కూనంనేని సాంబశివరావు చెప్పారు.

అనిల్‌కుమార్ మరణం 'నవతెలంగాణ'కు తీరని లోటు

- నవతెలంగాణ సిజిఎం పి ప్రభాకర్
- నవతెలంగాణ ప్రధాన కార్యాలయంలో సంతాప సభ
- నివాళి అర్పించిన సిబ్బంది

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిబద్ధత, అకింతభావంతో పని చేసిన ఉమ్మడి మెదక్ రీజియన్ డెస్క్ ఇన్‌చార్జి అనిల్‌కుమార్ మరణం నవతెలంగాణ సంస్థకు తీరని లోటని నవతెలంగాణ సీజీఎం పి.ప్రభాకర్ విచారణ వ్యక్తం చేశారు. శుక్రవారం పత్రిక ప్రధాన కార్యాలయం ఎంహెచ్ భవన్‌లో అనిల్‌కుమార్ సంతాప సభ నిర్వహించారు. ముందుగా అనిల్‌కుమార్ చిత్రపటానికి సిజిఎం పి.ప్రభాకర్, బుక్‌హౌస్ ఎడిటర్ ఆనందాచారి, ఎడివిటి జిఎం ఎ వెంకటేశ్, జిఎంలు, మేనేజర్లు, ఎడిటోరియల్ బోర్డు సభ్యులు, మఫిషల్ సభ్యులు, ఇతర సిబ్బంది పూలమాల వేసి నివాళి అర్పించారు. మృతుని కుటుంబానికి సంఘీభావం తెలిపారు. అనంతరం ఎడివిటి జిఎం ఎ వెంకటేశ్ అధ్యక్షతన జరిగిన సభలో ప్రభాకర్ మాట్లాడుతూ.. నవతెలంగాణలో ఐదేండ్లుగా పనిచేస్తున్న అనిల్‌కుమార్ హఠాత్తుగా మరణించడం బాధకరమైన విషయమన్నారు.

పని పట్ల ఆయనకు ఉన్న అకింతభావం మనందరికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు. పని సందర్భంలో తోటి సిబ్బందితో వ్యవహరించే తీరు ఆదర్శనీయమన్నారు. బుక్‌హౌస్ ఎడిటర్ ఆనందచారి మాట్లాడుతూ.. అనిల్ అకాల మరణం ఆయన కుటుంబానికి, నవతెలంగాణకు తీరని లోటని అన్నారు. నవతెలంగాణ సంస్థలో తక్కువ కాలం పాటు పనిచేసినప్పటికీ ఆయన అందించిన సేవలు మరిచి పోలేనివని అన్నారు. మఫిషల్ ఇన్‌చార్జి వేణు మాధవ్‌రావు మాట్లాడుతూ.. సంస్థ నిర్ణయాల పట్ల ఎంతో కట్టుబడి ఉండి పనిచేసిన అనిల్‌కుమార్ మరణం విషాదకరమన్నారు. జీఎం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ అనిల్‌కుమార్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తన తోటి సహచారులను పని విషయంలో సమన్వయం చేసుకుంటూ సమర్థవంతంగా డెస్క్‌ను నడిపారని తెలిపారు. ఎడిటోరియల్ బోర్డు సభ్యులు మోహన్ కృష్ణ మాట్లాడుతూ అనిల్‌కుమార్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జీఎంలు భరత్, వాసు, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్‌లో వైద్య విద్యార్థి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో వైద్య విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతిచెందడం కలకలం రేపుతోంది. ఇంకో రెండు నెలల్లో ఉద్యోగంలో చేరబోతున్న యువకుడు మృతిచెందడంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. వివరాల్లోకెళ్తే.. నిమ్స్‌లో నితిన్ బిఎస్‌సి అనస్థీషియా టెక్నీషియన్ ఇంటర్న్‌షిప్ చేస్తున్నాడు. గురువారం రాత్రి విధులకు హాజరైన అతను అర్ధరాత్రి ఎవరికీ కనిపించలేదు. శుక్రవారం ఉదయం ఆపరేషన్ థియేటర్‌లో విగతజీవిగా పడి ఉండటాన్ని ఆస్పత్రి సిబ్బంది గమనించింది. సమాచారం అందుకున్న పంజాగుట్ట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. నితిన్ మృతిపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. ఇంకో రెండు నెలల్లో కోర్సు పూర్తవుతుందనగా, భవిష్యత్‌పై ఎన్నో ఆశలతో ఉన్నాడన్నారు. ఇంతలో ఇలాంటి ఘటన జరగడంతో కన్నీటి పర్యంతమయ్యారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు పంజాగుట్ట సిఐ రామకృష్ణ తెలిపారు. ప్రాథమిక దర్యాప్తులో ఎలాంటి గాయాలూ కనబడలేదని, సూసైడ్ నోట్ కూడా లభించలేదని అన్నారు. పోస్ట్‌మార్టం అనంతరం మృతికి గల కారణం తెలుస్తుందన్నారు. నిమ్స్ డైరెక్టర్ డా.బీరప్ప స్పందిస్తూ.. తమ సంస్థలో ఇంటర్న్‌షిప్ చేస్తున్న నితిన్ మృతిచెందడం చాలా బాధాకరం అన్నారు.

రంగస్థలానికి జీవితాన్ని అంకితం చేసిన దుగ్గిరాల సోమేశ్వరరావు

ప్రజాశక్తి కల్చరల్

ప్రభుత్వ శాఖలో ఉన్నత అధికారిగా ఉన్న సమయంలో తదుపరి పదవీ విరమణ విశ్రాంత జీవనంలోనూ రంగస్థలానికి జీవితాన్ని అంకితం చేసిన ధన్య జీవి దుగ్గిరాల సోమేశ్వరరావు అని కేంద్రీయ విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు డిఎస్ఎన్ మూర్తి అన్నారు. నాంపల్లిలోని ఎన్‌టిఆర్ కళా మందిరంలో ప్రముఖ నాటక రంగ సంస్థ రస రంజని నిర్వాహణలో దుగ్గిరాల సోమేశ్వర రావు 93 వ జయంతి సందర్భంగా ఆత్మీయ పురస్కారాలు నాటక రచయిత నటుడు జె శశి మోహన్‌కు, నటి ఎ నాగ మణికి, సాంస్కృతిక అభిమాని రాయప్రోలు భగవాన్‌కు ప్రదానోత్స సభ జరిగింది. ప్రత్యేక అతిదిగా ఆచార్య మూర్తి పాల్గొని పురస్కారాలు బహుకరించి మాట్లాడారు సోమేశ్వర రావు నాటక దర్శకుడు నటుడుగా అత్యంత ప్రతిభావంతుడు అన్నారు. అధ్యక్షత వహించిన రస రంజని అధ్యక్షుడు డాక్టర్ కె వి రమణ మాట్లాడుతూ మూడున్నర దశాబ్దాలపైగా కొనసాగుతున్న రస రంజని నాటక సంస్థ నిర్వాహణలో సోమేశ్వర రావు పాత్ర కీలకం అన్నారు. ఆయనకు రంగస్థలంకు సంబంధించిన అన్ని శాఖలలో అవగాహన ఉందని అన్నారు. కవిగా ఆయన రాసిన కవితలు సూక్తులు అని చెప్పారు. పురస్కారాలు అందుకున ముగ్గురు వారి రంగంలో విశేష కృషి చేశారని ప్రశంసించారు. రంగస్థల ప్రముఖులు డాక్టర్ డిఎస్ఎన్ మూర్తి, అమరేంద్ర , నాటక రచయిత డాక్టర్ విజయ భాస్కర్ పాల్గొన్న సభ ను రస రంజని కార్యవర్గం దుగ్గిరాల కుటుంబ సభ్యులు పర్యవేక్షణ చేశారు తొలుత మల్లేశ్వరి ఆర్ట్స్ హైదరాబాద్ వారిచే భవానీ ప్రసాద్ రచించిన 'నువ్వో సగం నేనో సగం' నాటిక పి సుబ్బారావు దర్శకత్వంలో ప్రదర్శించారు.

ఇనార్బిట్ మాల్స్‌లో దీపావళి ఉత్సవం

హైదరాబాద్ : ఈ దీపావళికి ఇనార్బిట్ మాల్స్ కేవలం దీపాలు, షాపింగ్, ఉత్సాహంతో కాకుండా "ఆనంద ప్రతిబింబాలు అనే హృదయాన్ని హత్తుకునే 2025 డిజిటల్ ప్రచారం ద్వారా సంబరాలు జరుపుకోవాలని నిర్ణయించినట్లు పేర్కొంది. 2004లో మొదటి మాల్ ప్రారంభించినప్పటి నుండి, ఇనార్బిట్ కేవలం షాపింగ్ స్థలం మాత్రమే కాకుండా ప్రజల జీవితాల్లో భాగమైందని ఇనార్బిట్ మాల్స్ (ఇండియా) చీఫ్ బిజినెస్ ఆఫీసర్ రోహిత్ గోపాలని పేర్కొన్నారు. ఇది కేవలం షాపింగ్ గురించి కాదని.. మానవ సంబంధాల ద్వారా ఒకే సమాజంతో సంబంధాలు జరుపుకోవడమన్నారు.

యాక్సిస్ ఫైనాన్స్ నుంచి 'శక్తి' మైక్రో రుణాలు

హైదరాబాద్ : బ్యాంకింగేతర విత్త సంస్థల్లో ఒక్కటైన యాక్సిస్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఎఎఫ్ఎల్) కొత్తగా శక్తి పేరిట ప్రాపర్టీలపై మైక్రో లోన్ (మైక్రో ఎల్ఎపీ) ఉత్పత్తులను ప్రవేశపెట్టినట్లు తెలిపింది. వ్యాపార, వ్యక్తిగత అవసరాలకు తగ్గ ఆర్థిక సొల్యూషన్స్‌ని అందించడం ద్వారా వర్ధమాన కస్టమర్లకు సాధికారత కల్పించేలా దీన్ని రూపొందించామని ఆ సంస్థ ఎండి, సిఇఒ సాయి గిరిధర్ తెలిపారు. తయారీ, ట్రేడింగ్, సర్వీసు రంగాలకు చెందిన మైక్రో ఎంట్రప్రెన్యూర్లు, ట్రేడర్లు, స్వయం ఉపాధి పొందే వారితో పాటు వేతనాలు పొందే కస్టమర్లకు మద్దతును అందించనున్నామన్నారు.

స్టోవ్ క్రాఫ్ట్ కొత్తగా 'త్యోహార్ మెరా స్టైల్' క్యాంపెయిన్

హైదరాబాద్ : కిచెన్ అప్లయెన్స్ కంపెనీలలో ఒకటైన స్టోవ్‌క్రాఫ్ట్ లిమిటెడ్ తన ప్రముఖ బ్రాండ్ పిజన్ అప్లయెన్సెస్ కోసం పండుగ కాలానికి అనుగుణంగా 'త్యోహార్ మెరా స్టైల్' పేరుతో ప్రత్యేక ప్రచారాన్ని ప్రారంభించినట్లు తెలిపింది. "భారతదేశంలో పండగలు ఆనందం, భోజనం, కుటుంబం, ఐక్యత అలాగే వ్యక్తిగత వ్యక్తీకరణ గురించినవే. 'త్యోహార్ మెరా స్టైల్' ద్వారా ప్రతి ఒక్కరు తమదైన రీతిలో పండుగలను ఎలా జరుపుకుంటారో ఆ ప్రత్యేకతను మేము జరుపుకుంటున్నాం" అని స్టోవ్‌క్రాఫ్ట్ లిమిటెడ్ ఎండి రాజేంద్ర గాంధీ తెలిపారు.

అమెజాన్ 'ఫెస్టివ్ డిలైట్ ఆఫర్లు'

హైదరాబాద్ : ప్రస్తుత పండగ సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ 2025లో భాగంగా ఫెస్టివ్ డిలైట్ ఆఫర్లను అందిస్తున్నామని అమెజాన్ ఇండియా తెలిపింది. స్మార్ట్ ఫోన్లు, ల్యాప్ టాప్స్, టివిలు, ఫ్యాషన్, బ్యూటీ, హోమ్ డెకార్, ఉపకరణాలు, ఫర్నిచర్ మరియు కిరాణా సరకులు సహా ధనత్రయోదశి మరియు దీపావళి ఆఫర్లను అందిస్తోన్నట్లు పేర్కొంది. బంగారం, వెండి, డైమాండ్ అభరణాలను కూడా కొనుగోళ్లు చేయవచ్చని పేర్కొంది.

క్వాలిజీల్ 'ల్యాబ్ ఇన్ ఎ బాక్స్' ఆవిష్కరణ

హైదరాబాద్ : ఇంజినీరింగ్, కృత్రిమ మేధా (ఎఐ) సేవలను అందించే క్వాలిజీల్ కొత్తగా డిజిటల్ ఎక్స్‌పీరియెన్స్ టెస్టింగ్ సంస్థ పీక్లోడీతో కలిసి ఏజెంటిక్ ఎఐ ఆధారిత ల్యాబ్-ఇన్-ఎ-బాక్స్‌ను ఆవిష్కరించినట్లు వెల్లడించింది. సంస్థలు తమ యాప్‌లను పరీక్షించుకునేందుకు ఇది తోడ్పడుతుందని క్వాలిజీల్ సహ వ్యవస్థాపకుడు మధు మూర్తి తెలిపారు. ఆండ్రాయిడ్, ఐఒఎస్‌లపై యాప్‌లు ఎలా పని చేస్తున్నాయి..? లోపాలేమైనా ఉన్నాయా..? అనేది తెలుసుకోవచ్చని పీక్లోడీ సిఇఒ అవినాష్ తివారీ అన్నారు.

పిపిఎస్ మోటార్స్‌లో ఎంజి విండ్సర్ ఇన్‌స్పైర్ విడుదల

హైదరాబాద్ : ఎంపి మోటార్స్ ఇవి పరిమిత ఎడిషన్ అయినా విండ్సర్ ఇన్‌స్పైర్ ఎడిషన్‌ను హైదరాబాద్‌లోని ఎల్‌బి నగర్ షోరూమ్‌లో ప్రారంభించినట్లు పిపిఎస్ మోటార్స్ తెలిపింది. దేశంలో ఒక సంవత్సరం కంటే తక్కువ సమయంలోనే 40,000 యూనిట్ల మైలురాయిని దాటిన విండ్సర్ విక్రయాలు జరిగాయని గుర్తు చేసింది. కేవలం 300 యూనిట్ల ఉత్పత్తి మాత్రమే చేస్తోన్నట్లు జెఎస్‌డబ్ల్యు ఎంజి మోటార్ ఇండియా చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ వినయ్ రైనా పేర్కొన్నారు. దీని ఆవిష్కరణలో మోటార్స్ మేనేజింగ్ డైరెక్టర్ రాజీవ్ సంఘ్వి, జెఎస్‌డబ్ల్యు మోటార్ ఇండియా జోనల్ హెడ్ (సౌత్) సౌరవ్ ప్రకాష్ మరియు రెండు సంస్థల నుండి ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

గ్లోబల్ బ్రాండ్స్‌లో ఆపిల్ టాప్ సామ్‌సంగ్‌కు 5వ ర్యాంక్

వాషింగ్టన్ : ప్రపంచవ్యాప్తంగా ఉన్న కంపెనీల్లో విలువ పరంగా ఆపిల్ అగ్రస్థానంలో నిలిచింది. ఇంటర్ బ్రాండ్స్ 'బెస్ట్ గ్లోబల్ బ్రాండ్స్' జాబితాను ప్రకారం.. మైక్రోసాఫ్ట్ రెండో స్థానంలో, అమెజాన్ మూడు, గూగుల్ నాలుగు, శాంసంగ్ ఐదో స్థానంలో ఉన్నాయి. సెమీకండక్టర్ తయారీ సంస్థ ఎన్విడియా గతేడాది 36వ స్థానంలో ఉండగా.. ఈసారి 15వ స్థానానికి చేరి వేగంగా పురోగతి సాధించిన గ్లోబల్ బ్రాండ్‌గా నిలిచింది. వరుసగా ఆరో ఏడాది కూడా ఇదే స్థానాన్ని నిలుబెట్టుకున్నామని సామ్‌సంగ్ పేర్కొంది. 90.5 బిలియన్ల బ్రాండ్ విలువను కలిగి ఉన్నామని పేర్కొంది. ఎఐ ఆవిష్కరణలు, ఓపెన్ సహకారం ద్వారా, సామ్‌సంగ్ తమ రోజువారీ జీవితంలో ఎఐని మరింత మంది వినియోగదారులు అనుభవించేలా కృషి చేస్తోందని ఆ కంపెనీ ప్రెసిడెంట్ వోనో జిన్ లీ పేర్కొన్నారు.

మెడికవర్‌లో అనస్తీషియా దినోత్సవం

హైదరాబాద్ : వైద్య రంగంలో అనస్థీషియా విభాగం అత్యంత ముఖ్యమైన, ప్రాణ రక్షణకు సంబంధించిన విభాగాలలో ఒకటి. ప్రతి సంవత్సరం అక్టోబర్ 16న జరుపుకునే ప్రపంచ అనస్థీషియా దినోత్సవాన్ని మెడికవర్ హాస్పిటల్‌లో వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికవర్ హాస్పిటల్స్, హైటెక్ సిటీలో అనస్థీషియా విభాగ వైద్యులు, నర్సులు, సిబ్బంది అందరూ కలిసి కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. "శస్త్రచికిత్స విజయానికి వెనుక ఉన్న నిశ్శబ్ద శక్తి అనస్థీషియా బృందమే. రోగి ప్రాణ భద్రత, నొప్పి నియంత్రణ, శస్త్రచికిత్స సమయంలో స్థిరమైన పరిస్థితులను నిర్వహించడం మా ప్రధాన బాధ్యత. రోగులు భయంలేకుండా, సౌకర్యవంతంగా చికిత్స పొందేలా చేయడమే మా లక్ష్యం." మెడికవర్ హాస్పిటల్స్, హైటెక్ సిటీ హెడ్ ఆఫ్ అనస్తీషియాలజీ డాక్టర్ రామకృష్ణ పేర్కొన్నారు.

పోర్చుగీస్ ఫుట్‌బాల్ ఫెడరేషన్‌తో విటి మార్కెట్స్ జట్టు

హైదరాబాద్ : ఆన్‌లైన్ ట్రేడింగ్ ప్లాట్‌ఫాం అయిన వీటీ మార్కెట్స్ మిడిల్ ఈస్ట్, నార్త్ ఆఫ్రికా ప్రాంతంలో ప్రత్యేక అధికారిక ట్రేడింగ్ భాగస్వామిగా మారడానికి పోర్చుగీస్ ఫుట్‌బాల్ ఫెడరేషన్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు తెలిపింది. ఈ భాగస్వామ్యం కంపెనీ ప్రాంతీయ విస్తరణలో ముఖ్యమైన అడుగు అని చెప్పవచ్చని విటి మార్కెట్స్ గ్లోబల్ మార్కెటింగ్ హెడ్ డాండెలిన్ కోహ్ పేర్కొన్నారు. మిడిల్ ఈస్ట్ మరియు నార్త్ ఆఫ్రికా ప్రాంతానికి వినూత్న, ఆసక్తికరమైన ట్రేడింగ్ అనుభవాన్ని తీసుకురావడానికి పోర్చుగీస్ ఫుట్‌బాల్ ఫెడరేషన్‌తో భాగస్వామ్యం అవ్వడం తమకు సంతోషంగా ఉందన్నారు.